విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 22, నవంబర్ 2024

రాఘవేంద్ర పాఠశాలను తక్షణమే సీజ్ చేయాలి

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: జిల్లా చాగలమరి మండల కేంద్రంలో ఉన్న రాఘవేంద్ర పాఠశాల యాజమాన్యం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, ఆ పాఠశాలను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డికి ఏఐఎస్ఎఫ్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ్ మాట్లాడుతూ చాగలమర్రి మండల కేంద్రంలో ఉన్న రాఘవేంద్ర పాఠశాల యాజమాన్యం ఎయిడెడ్ పాఠశా లలోనే మరో ప్రైవేట్ స్కూల్‌ను నడుపుతూ, ఎలాంటి ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా కనీసం స్కూల్ బోర్డు లేకుండా, సీసీ కెమెరాలు లేకుండా, విద్యార్థులకు సరిపడు టాయిలెట్స్ లేకుండా, రేకుల షెడ్డులో పాఠశాల నిర్వహిస్తుందని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇష్టారాజ్యంగా పాఠశాల నడుపుతున్నప్పటికి మండల విద్యాశాఖ అధికారి అనురాధ ఏమాత్రం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శిలు ఎర్రి స్వామి, సురేష్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సంతోష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: దేశవ్యాప్తంగా ఈ నెల 26న కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ 13 కేంద్ర కార్మిక సంఘాలు, 500 రైతు సంఘాలు సంయుక్తంగా జిల్లా కేంద్రాలలో చేపట్టనున్న దేశవ్యాప్త నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటియుసి, కార్మిక సంఘాల రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఏఐటియుసి కార్మిక సంఘాల, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం నంద్యాల సిపిఐ పార్టీ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్నలు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కార్మికులు రైతులు పదేళ్ల క్రితం పెట్టిన 15 డిమాండ్లలో ఏ ఒక్క కోర్కెను మోడీ ప్రభుత్వ నెరవేర్చలేదని విమర్శించారు. ఈ నెల 26 నంద్యాలలో జరిగే కార్మిక కర్షక ఐక్య ధర్నాలో పెద్దసంఖ్యలో నిరుద్యోగులు, కార్మికులు, రైతులు, కౌలు రైతులు, ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ శివ బాలకృష్ణ, నంద్యాల సిటీ అధ్యక్ష కార్యదర్శులు బి.శ్రీనివాసులు, డి.శ్రీనివాసులు, ఏఐటియుసి నాయకులు బాల సంజీవులు, ఆనంద్, పీఎం రమేష్, సుశీలమ్మ, రవి, వేదవతి, రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: కిశోరి వికాస కార్యక్రమం కింద బాలికల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసి, ఉన్నత స్థాయి జీవన ప్రమాణాలు పెంపొందిం చేందుకు సమిష్టి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి తెలి పారు. గురువారం నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీలోని కోపరేటివ్ ఫంక్షన్ హాల్‌లో కిశోరి వికాస కార్యక్రమం కింద క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి ఇచ్చే జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడి లీలావతి, డిఎల్డిఓ శివ నాగిరెడ్డి, డివిఈఓ సునీత, స్త్రీ శిశు సంక్షేమ అధికారులు, ఎంపీడీ వోలు, ఈఓఆర్డీలు, వైద్య సిబ్బంది తదితరులు శిక్షణా కార క్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ కిషోరి బాలికలకు సరైన విజ్ఞానాన్ని అందించి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసే గురుతర బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. జిల్లాలో స్త్రీ శిశు సంక్షేమం, వైద్య సిబ్బంది, పంచాయతీ, సచివాలయ వ్యవస్థ తదితర పెద్ద యంత్రాంగం ఉండి బాల్య వివాహాలు నిరోధించడంలో వెనకబడి ఉన్నామని, బాల్య వివాహాల నియంత్రణలో రాష్ట్రంలో నంద్యాల జిల్లాను రెడ్ మార్క్ చూపించడం బాధాకరమన్నారు. బాల్య వివాహాలు చేయొద్దని ఎంత కౌన్సిలింగ్ ఇచ్చినా వినే పరిస్థితిలో లేని తల్లిదండ్రులు, అత్తమామలపై కేసులు నమోదు చేస్తారని తెలిపారు. అనంతరం కిశోర బాలల పరిరక్షణపై ముద్రించిన పుస్తకాన్ని, గోడపత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు.

రెసిడెన్షియల్, కమర్షియల్ బిల్డింగులకు అనుమతులు తప్పనిసరి

విశాలాంధ్ర - బనగానపల్లె: రెసిడెన్షియల్, కమర్షియల్ బిల్డింగులకు అనుమతి తప్పనిసరిని అని మేజర్ గ్రామపంచాయతీ ఈవో సతీష్ కుమార్ అన్నారు. ఈవో సతీష్ కుమార్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ బిల్డింగ్ నిర్మాణము 300 చదరపు మీటర్లు లోపు అయితే బనగానపల్లె గ్రామపంచాయతీ అనుమతి ఇవ్వబడునని, 300 చదరపు మీటర్లు దాటితే కర్నూలు కుడా అనుమతి తప్పనిసరిని అన్నారు. ఎలాంటి కమర్షియల్ నిర్మాణం అయిన కుడా వారి అనుమతి పొందాలన్నారు. పర్మిషన్ పొందిన తరువాతనే నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారు.

కాలనీలలో ముళ్ళకంప తొలగింపు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని ఆయా కాలనీలు, ప్రభుత్వ కార్యాలయాల సమీపలలో సర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో జెసివి తో ముళ్ళ పొదల తొలగింపున పనులను గురువారం చేపట్టారు. ఏపీ మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే రహదారికి ఇరువైపులా, ఎంపీడీవో, ఎంఈఓ, హౌసింగ్ ప్రభుత్వ కార్యాలయాల సమీపలలో ఉన్న ముళ్ళ పొదలను తొలగించి చదును చేశారు. ఆయా కాలనీలలో వెళ్లే ప్రస్తాలలో ఉన్న కంప చెట్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో సర్పంచ్ స్పందించి పనులను చేపట్టారు. కాలనీలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు ప్రజలు సహకరించాలని సర్పంచ్ కోరారు.

మల్లన్న సేవలో శ్రీశైల జగద్గురు

విశాలాంధ్ర - శ్రీశైలం: ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీశైల మహా క్షేత్రంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను శ్రీశైల పీఠాధిపతి జగద్గురు శ్రీ శ్రీ శ్రీచెన్నసిద్దారామ శివాచార్య మహాస్వామి గురువారం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని సేవించుకున్నారు. వీరికి ఆలయ రాజగోపురం వద్ద ఆలయ అర్చక వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం జగద్గురు స్వామి అమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచనమండపంలో పీఠాధిపతుల గౌరవం అర్చక వేద పండితులు వేదగోష్టి నిర్వహించారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - బేతంచర్ల : మండలంలోని గోరుమానుకొండ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాల నందు రాష్ట్ర సిఐడి శాఖ ఆదేశాల మేరకు సిఐడి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం ఎస్సీ,ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న డోన్ ఆర్డిఓ నరసింహులు, డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల వాసులు నేటికి జన జీవన స్రవంతికి ఆమడ దూరంలో ఉంటున్నారని,వారి హక్కులను ఎవరైనా భంగం కలిగించడం, వారి హక్కులను కాలరా యడం జరిగితే చట్ట ప్రకారం ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణలో భాగంగా కేసులను నమోదు చేస్తామన్నారు. సదస్సులో ఎంపీడీవో ఫజల్ రహిమాన్, తహశీల్దార్ నాగమణి, సీఐ వెంకటేశ్వరరావు, సిఐడి సీఐ గిరి బాబు, ట్రైబల్ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ హుస్సేనయ్య పాల్గొన్నారు.

హౌస్ హెూల్డ్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర - రుద్రవరం . హౌస్ హెూల్డ్ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని 1, 2 సచివాలయాలను, ఆలమూరు, నరసాపురం, సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ హౌస్ హెూల్డ్ జియో ట్యాగ్ సర్వేని వందశాతం పూర్తి చేయాలన్నారు. ఎస్పీసీఐ బెనిఫిషియన్ మ్యాపింగ్‌ను పూర్తి చేయాలన్నారు. అనంతరం నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందించే వైద్యసేవలను గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రుద్రవరం గ్రామము లో ఉపాధి హామీ పథకానికి సంబంధించి వాసాపురం వెంకటేశ్వర స్వామి గుడి సమీపంలో ఉన్న మామిడి తోటను సందర్శించారు.

షుగర్ రోగులకు వ్యాయామం తప్పనిసరి

విశాలాంధ్ర - పాణ్యం : సుగర్ రోగులు ప్రతి రోజూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలని శాంతిరాం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదన శెట్టి అన్నారు. 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాల సందర్భంగా గురువారం ఆర్ జి యం విద్య సంస్థలో పనిచేసే డ్రైవర్లు, అటెండర్లు, ఇతర బోధ నేతర సిబ్బందికి మధుమేహ వ్యాధి గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి మధుసూదన శెట్టి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ షుగర్ వ్యాధికి గురికాకుండా చక్కని ఆహార నియమాలు పాటించాలన్నారు. వ్యాధి ఉన్నవాళ్లు రక్తంలో చక్కెర శాతాన్ని పరిశీలించుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం, మందులు వేసుకోవాలని తెలిపారు. కళాశాల ప్రాంగణంలో ఫార్మా డీ విద్యార్థులు ఆర్జియం సంస్థల సిబ్బందికి బీపీ, మధుమేహ వ్యాధి పరీక్షలు నిర్వహించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు.

వైసీపీ నాయకున్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర - శిరివెళ్ల: మండల పరిధిలోని గుండంపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు సారెడ్డి రమణారెడ్డిని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గురువారం పరామర్శించారు. గత కొద్ది రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతున్న రమణారెడ్డిని గుండంపాడు గ్రామంలోని ఆయన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే కలిసి ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గంగుల వెంట వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు బసాపురం అబ్దుల్ సలాం, జడ్‌పి వైస్ చైర్మన్ కమ్మ సుబ్బరాయుడు, జింకల నాగన్న, ముజఫర్ హుస్సేన్, గుండంపాడు ప్రతాపరెడ్డి, మాజీ ఆలయ చైర్మన్ రామాంజనేయ రెడ్డి, మాజి సర్పంచ్ మెరువ నాగ భూషణం రెడ్డి తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి సహకరించాలని బిసి ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. పట్టణ శివారులోని గుత్తి రోడ్డులో గల నెహ్రూ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు నా బనగానపల్లె, నా ఆరోగ్యం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి సతీమణి బీసీ ఇంద్రారెడ్డి మాట్లా డుతూ సంక్రాంతి నాటికి బనగానపల్లెలో ప్లాస్టిక్ నిషేధించినట్లు తెలిపారు.

యురేనియం టెండర్లను తక్షణమే రద్దు చేయాలి

విశాలాంధ్ర - ప్యాపిలి: ప్యాపిలి మండలంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన యురేనియం టెండర్లను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పాత బస్టాండ్ ఆవరణం లో సిపిఐ ప్యాపిలి మండల కార్యదర్శి వి.వెంకటేష్ అధ్యక్షతన ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోన్ నియోజకవర్గం ప్యాపిలి మండల పరిధి లోని జక్కసానికుంట్ల, మామిళ్లపల్లె, రాంపురం, గ్రామాల్లో యురేనియం తవ్వకాలు వల్ల బంగారు పంటలు నాశనమై గాలి, నీరు కలుషితం అవుతుందని, దాదాపుగా యూరిన్ తవ్వకాల వల్ల 100 కిలోమీటర్ల ప్రమాదం ఉందన్నారు. పంట నష్టము, ప్రాణ నష్టము గ్రామ ప్రజలు అల్లాడిపోతున్న తరుణంలో ప్రశాంతంగా జీవిస్తున్న ప్రజలకు హానిక రంగా కలిగించే యూరియన్ త్రవ్వకాల వల్ల ప్రజలంత భయభ్రాంతులకు గురవుతు న్నారన్నారు. ఇలాంటి తరుణంలో కేంద్ర ప్రభుత్వం రూ.5 వేల కోట్లు టెండర్లకు ముహూర్తం ఖరారు చేసిందని ఇలాంటి టెండర్లను రద్దు చేయకుంటే సీపీఐ ప్రజా ఉద్య మాలకు పూనుకుంటామని వారు హెచ్చరించారు. మండలం కేవలం వర్షాధార మీద రైతులు పంటలు పండించు కొని జీవనం చేస్తున్నారని ఇలాంటి పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వం యూరియన్ త్రవ్వకాలకు అనుమతులు ఇవ్వడం ఇవ్వడం సిగ్గుచేటని తక్షణమే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అనుమతులు రద్దు చేయాలని ఆయన అన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం టెండర్ నోటీస్ ఇవ్వడం ప్రజల ప్రాణాలతో చెలగాటమా డడమే అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దుర్మార్గ మైన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రజలను కలుపుకొని ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు జిల్లా మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి ఎన్ఎండీ ఫరూక్ స్థానిక ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని వారు విజ్ఞప్తి చేశారు. లేకపోతే ప్రజాప్రతినిధుల ఇల్లు ముట్టడిస్తామని వారు అన్నారు. ఈ యురేనియం తవ్వకాల వల్ల పంట పొలాలు జీవ రాశుల మునుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రజలు చైతన్యం కావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ కార్య క్రమంలో సీపీఐ డోన్ మండల కార్యదర్శి బి.నారాయణ పట్టణ కార్యదర్శి మోట రాముడు, సీపీఐ ప్యాపిలి మండలం సహాయ కార్యదర్శి వెంకటేష్, డోన్ పట్టణ సహాయ కార్యదర్శి రామ్మోహన్, ఏఐ ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ ఏఐటీ యూసీ కార్యదర్శి అబ్బాస్, హమాలీ, ఆటో యూనియన్ నాయకులు శీను, మధు, మద్ది లేటి కార్మికులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

యురేనియం త్రవ్వకాల టెండర్లను రద్దు చేయాలి

జిల్లాలో డోన్ నియోజకవర్గం ప్యాపలి మండలంలో జక్కసాని కుంట్ల, మామిళ్ళపల్లి, రాంపురం గ్రామాల్లో యురేనియం త్రవ్వకాల కోసం వేసే టెండర్లను తక్షణమే రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అత్యంత వెనుక బడిన కరువు జిల్లాల్లో అత్యల్ప వర్ష పాతం వల్లరైతులకు పంటలు పండకుండా ప్రతి ఏటా సుదూర ప్రాంతాలకు పేద రైతులు, వ్యవసాయకూలీలు వలసలు పొట్ట చేత బట్టుకొని వెళుతున్న ఈ ప్రాంతాల్లో రైతుల పొలాలకు సాగునీరు అందించి రైతులను, వ్యవసాయకూలీలను ఆదుకోవడానికి శాశ్వత కరువునుపారద్రోలడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయకపోగా, కరువు ప్రాంతాల్లో యూరేనియం త్రవ్వకాలు చేపట్టి ప్రజల, జంతువుల జీవనాన్ని దెబ్బతీసి, వాతావరణాన్నే కలుషితం చేసే చర్యలు చేపట్టడానికి పూనుకోవడం చాలా దారుణం. ఈ త్రవ్వకాలవల్ల కడప జిల్లా పులివెందుల ప్రాంతంలో తుమ్మల పల్లి చుట్టుపక్కల ప్రజలు నరకప్రాయమైన జీవితాలను గడుపుతున్నారు. కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల చుట్టుప్రక్కల ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్రవ్వకాలను నిలిపి వేశారు.డోన్ శాసన సభ్యులు, జిల్లా మంత్రులు రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లి అత్యంత ప్రమాద కరమైన యురేనియం త్రవ్వకాల టెండర్లను రద్దు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని కె.రామాంజనేయులు డిమాండ్ చేశారు.

పక్కా గృహాలు నిర్మించి, మౌలిక వసతులు కల్పించాలి : సీపీఐ

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : జూపాడు బంగ్లా గ్రామంలో గత 40 సంవత్సరాల నుండి ఎరుకలి కులస్తులు జీవనం కొనసాగిస్తున్నారని, వారికి పక్కా గృహాలు,ఇంటి పట్టాలు, మౌలిక వసతులు లేవని వారికి తక్షణమే అధికారులు పర్యావేక్షించి, వారి జీవన విధానాన్ని మెరుగుపరచాలని సిపిఐ జిల్లా నాయకులు ఎం. రమేష్ బాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం జూపాడు బంగ్లా గ్రామం లోని ఎరుకల కాలనీని సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూపాడు బంగ్లా గ్రామంలో, తాటిపారాలు కట్టుకొని, పూరి గుడిసెల్లో నిర్మించుకొని గిరిజనులు దాదాపు 15 కుటుంబాలు నివసిస్తున్నారని వారిని పట్టించుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందరన్నారు. తక్షణమే వారి సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు. గిరిజన సంఘం నాయకులు సుబ్బన్న, నడిపి సుబ్బన్న, వెంకటేశ్వర్లు, నడిపి సుద్దన్న, గంగన్న పాల్గొన్నారు.

అడవి బిడ్డలకు రాజమార్గం : ఎంపీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : శ్రీశైలం జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం కోసం విలువైన, సారవంతమైన వ్యవసాయ భూములు, ఇల్లు త్యాగం చేసి సర్వం కోల్పోయి నల్లమల అరణ్యంలో కనీస వసతులకు దూరంగా జీవిస్తున్న అడవి బిడ్డలకు కనీసం రోడ్డు మార్గం ఏర్పాటు చేసి, రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు ప్రసరింపజేసి చీకట్లో మగ్గుతున్న ఆ గ్రామాలకు బయటి ప్రపంచంతో అనుసంధానం చేసేందుకు, విద్యుత్ సరఫరా కోసం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి శ్రమిస్తున్నారు. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం నల్లమల అరణ్యంలో బయటి ప్రపంచానికి దూరంగా బ్రతుకుతున్న బలపాలతిప్ప, జానాలచెంచు గూడెం, సిద్దేశ్వరం, కపిలేశ్వరం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు రూ.50 లక్షలు, తారురోడ్డు నిర్మాణం కోసం రూ.4.40 కోట్లు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మంజూరు చేయించారు. కపిలేశ్వరం గ్రామం నుంచి సిద్దేశ్వరం, బలపాలతిప్ప, జానాలగూడెం వరకు 7.10 కిలోమీటర్ల దూరం వరకు 7.30 మీటర్ల వెడల్పుతో మెటల్ రోడ్డు, వాటిపై 3.75 మీటర్ల వెడల్పుతో బిటీ రోడ్డు నిర్మాణం కోసం, రోడ్డు ప్రక్కన విద్యుత్ స్థంబాలు, విద్యుత్ దీపాలు వేసేందుకు ఎంపీ బైరెడ్డి శబరి కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ప్రధానమంత్రి జనజాతీ ఆదివాసిన్యాయ్ మహా అభియాన్ పథకం ద్వారా, ట్రైబల్ గ్రూప్ ఆధ్వర్యంలో తారు రోడ్డుకు 4.40 కోట్ల రూపాయలు, విద్యుత్ సరఫరాకు 50 లక్షల రూపాయలు మంజూరు చేయించినట్లు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు.

చేపల ఉత్పత్తి పెంపుదలకు కృషి చేస్తాం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: జిల్లాలో చేపల ఉత్పత్తికి ఉన్నత ప్రమాణాలతో నివేదికలు సమర్పిస్తే నాబార్డుతో అనుసంధానం చేసి మరింత చేపల ఉత్పత్తి పెంపుదలకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. గురువారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రపంచ మత్స్య దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా మత్స్యశాఖ జెడి రాఘవరెడ్డి, బేస్త కుల సంఘ సభ్యులు, మత్స్యకారుల సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలోని 124 చెరువులు, ఐదు రిజర్వాయర్లలో చేపలను ఉత్పత్తి చేస్తున్నామని, వాటిని మరింత పెంచేందుకు ఉన్నత ప్రమాణాలతో నివేదికలు సమర్పిస్తే నాబార్డుతో అనుసంధానం చేసి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే మత్స్యశాఖ ప్రాముఖ్యత అధికంగా ఉందని, రాష్ట్రంలో మన జిల్లా 12వ స్థానంలో ఉందన్నారు. రాయలసీమ ప్రాంతంలో ఆహారపు అలవాటులలో చికెన్, మటన్ లాంటి అనారోగ్య ఆహారపు అలవాట్లలో మార్పు తీసుకువచ్చి ఆరోగ్యాన్ని ప్రసాదించే చేపల వంటకాలు స్వీకరించేలా మత్స్యకార సంఘ నాయకులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో 45 వేల హెక్టార్లలో 50 వేల మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తి జరుగుతుందన్నారు. చేపల ప్రాసెసింగ్ చేసే యూనిట్ల స్థాపనకు కృషి చేయాలన్నారు. రకరకాల వంటకాలతో చేపల ఆహార పదార్థాలను సిద్ధం చేసి మార్కెటింగ్ కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో చేపల ఉత్పత్తికి జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

బెల్లం సరఫరా చేయొద్దు : ఎక్సైజ్ సీఐ

విశాలాంధ్ర - నందికొట్కూరు: నాటు సారా తయారీదారులకు బెల్లం సరఫరా చేయరాదని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు కిరాణా దుకాణ యజమానులకు సూచించారు. గురువారం పట్టణంలోని స్థానిక ఎక్సైజ్ కార్యాలయం నందు కిరాణం దుకాణ యజమానులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా తయారీకి ప్రధానంగా బెల్లం వనరు అని కాబట్టి నాటు సారా తయారీదారులకు బెల్లం సరఫరా ఆపివేయాలని సూచించారు. పట్టణం నీలి షికారి కాలనీ, కోళ్ల బాపురం గ్రామం నాటు సారా తయారీ కేంద్రాలుగా గుర్తింపు ఉన్నదని తెలిపారు. కాబట్టి ఈ ప్రాంత వాసులకు బెల్లం సరఫరా చేసిన, అమ్మిన కేసులను ఎదురుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

అదనపు పని భారము తగ్గించాలి

విశాలాంధ్ర-అవుకు: ఆరోగ్య కార్యకర్తలకు అదనపు పరిభారాన్ని తగ్గించాలి అని ఉష యూనియన్ జిల్లా ట్రెజరర్ వెంకటేశ్వరమ్మ అన్నారు. ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏఎన్ఎంలు వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో మండల అభివృద్ధి అధికారి వెంగన్నకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 124 జీవోను అమలుపరిచి ఇతర విభాగాల పనిని తమకు అప్పగించవద్దు అని కోరుచున్నామన్నారు. ఇతర విభాగాలలో పని ఒత్తిడి వలన ఆరోగ్య శాఖలో పనులను నిర్వహించలేకపోతున్నామని వాపోతున్నారు. యూనియన్ నాయకుల ఆదేశాల మేరకు వినతిపత్రాన్ని అందించామని అన్నారు.

క్లిష్టమైన ప్రసవాల నిర్వహణపై వైద్య సదస్సు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల ఐఎంఎ అనుబంధ విభాగం మిషన్ పింక్ హెల్త్ ఆధ్వర్యంలో స్థానిక మధుమణి ఆసుపత్రి సమావేశ భవనంలో నంద్యాల పాంత వైద్యులకు క్లిష్టమైన ప్రసవాలు- ఎదుర్కొనే సమస్యలు- అనుసరించాల్సిన నూతన వైద్య విధానాలు అన్న అంశంపై వైద్య సదస్సు నిర్వహించారు. ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు అధ్యక్షతన, మిషన్ పింక్ హెల్త్ రాష్ట్ర శాఖ కార్యదర్శి, లైఫ్ హాస్పిటల్ నిర్వాహకురాలు డాక్టర్ లక్ష్మీ సౌజన్య నిర్వహణలో జరిగిన సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని సదస్సు ప్రారంభించారు. వైద్య విధానం గురించి లైఫ్ హాస్పిటల్ లో స్త్రీ వ్యాధి నిపుణులుగా పని చేస్తున్న డాక్టర్ హేమలత, డాక్టర్ పుష్పలత, డాక్టర్ సుష్మ, డాక్టర్ గీతాంజలి, డాక్టర్ మధువాణి, డాక్టర్ స్రవంతి మల్టీమీడియా ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఐఎంఏ మహిళా విభాగం నాయకులు డాక్టర్ నాగమణి, డాక్టర్ నర్మద, డాక్టర్ వసుధ రాణి, డాక్టర్ కల్పన, డాక్టర్ అరుణకుమారి పాల్గొన్నారు.

రహదారి ప్రమాదంలో వ్యక్తి మృతి..

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని మద్దూరు మెట్ట సమీపంలో 40వ జాతీయ రహదారిపై ప్రమాదవ శాత్తు ద్విచక్రవాహనం డివైడర్ ను ఢీకొన్న ఘటనలో మండలంలోని చిన్నబోధనం గ్రామానికి చెందిన చాకలి రాముడు (33) అనే వ్యక్తి మృతి చెందగా, పెద్దబోధనం గ్రామానికి చెందిన అంజీ అనే వ్యక్తి తీవ్రంగా గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చిన్నబోధనం గ్రామానికి చెందిన చాకలి రాముడు, అంజిలు ఇద్దరు బావాబామర్దులు సమీప బంధువుల వివాహం మండలంలోని మద్దూరు గ్రామానికి ద్విచక్రవాహనంలో వచ్చారు. అక్కడ పెళ్లి చూసుకుని తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా, జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం డివైడర్ను ఢీకొంది. దీంతో రాముడు (33) అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రం గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యసేవలకై కర్నూలుకు తరలించారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

26 నుండి రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీలు

విశాలాంధ్ర - నందికొట్కూరు : ఈ నెల 26 నుండి 27వ తేదీ వరకు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీలు నందికొట్కూరు పట్టణంలోని శ్రీ నవనంది హై స్కూల్ ప్రాంగణం నందు సెపక్ తాక్ర బాల బాలికల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ చైర్మన్ బద్దుల శ్రీధర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలియజేస్తూ నంద్యాల సెపక్ తాక్రా అసోసియేషన్, రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో శ్రీ నవనంది విద్యాసంస్థ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలకు మూడు క్రీడా మైదానాలను ఏర్పాటు చేశామని అదేవిధంగా వివిధ జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారులకు నవనంది హై స్కూల్ పాఠశాలలో ఉచిత వసతి భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలను లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 22 నుంచి 26వ తేదీల్లో కేరళలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో మన రాష్ట్రం తరఫున పాల్గొంటారని తెలిపారు.

టీడీపీ ప్రభుత్వంతోనే నియోజకవర్గ అభివృద్ధి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: టీడీపీ ప్రభుత్వంతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం అవుతుందని మాజీ కౌన్సిలర్ బూత్ కన్వీనర్ యూసుఫ్ అన్నారు. గురువారం శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ సభ్యత నమోదు 15 వార్డు 60 బూత్ నందు మాజీ కౌన్సిలర్ బూత్ కన్వీనర్ యూసుఫ్ ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ప్రతి ఒక్కరు టీడీపీ సభ్యత్వం నమోదు చేసుకోవలన్నారు. టీడీపీ నాయకులు మంగయ్య, శేషమ్మ, గోవిందు, పుల్లయ్య, పూల బాష, తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులం సీసీ రోడ్డు నిర్మాణాలలు తనిఖీ

విశాలాంధ్ర - శిరివెళ్ల: మండల పరిధిలోని గుంప్రమానుదిన్నె గ్రామంలో నిర్మాణంలో ఉన్నటువంటి మినీ గోకులం షెడ్డులను వెంకటాపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణాలను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జనార్ధన్ రావు గురువారం తనిఖీ చేశారు. పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం వసతుల కల్పనలో భాగంగా అర్హులైన పాడి పరిశ్రమ రైతులకు గోకులం షెడ్డు యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసిన విషయం విధితమే, ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మాణాలను పరిశీలించి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా గోకులం షెడ్లు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. నిర్మాణ దశలను బట్టి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా గోకులం షెడ్డు నిర్మాణాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

26న రైతు కార్మిక సంఘాల మహా ప్రదర్శన ధర్నా



విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఈ నెల 28న కేంద్ర కార్మిక సంఘాలు కిసాన్ సంయుక్త మోర్చా జాతీయ సమితి పిలుపు మేరకు జిల్లా పరిషత్ నుండి కలెక్టరేట్ వరకు మహా ప్రదర్శన ధర్నాలను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప కోరారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం జిల్లా ఉపాధ్యక్షులు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి జి చంద్రశేఖర్, నగర ఉప ప్రధాన కార్యదర్శి టి రామాంజనేయులు, నాయకులు, ఎ.ఈశ్వర్, డిసి రహిమాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రైతు ఉద్యమ సందర్భంగా రైతులకు క్షమాపణ చెప్పి నల్ల చట్టాలను వెనక్కి తీసుకుంటామని రైతుల పండించిన పంటకు గిట్టుబాటు ధర చట్టం తీసుకొస్తామని ఉద్యమంలో చనిపోయిన రైతులకు ఎక్స్ గ్రేషియా చెల్లిస్తామని చెప్పి మాట తప్పాడని వారు విమర్శించారు. అనేక త్యాగాలు చేసి దేశ కార్మిక వర్గం సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకుని వచ్చి కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత,సమ్మె హక్కు,ఎనిమిది గంటల పని విధానం లాంటి హక్కులను హరించివేసి కార్మికులను యజమానులకు బానిసలు చేసేటువంటి చర్యలకు పూనుకుందని విమర్శించారు. ఆటో, హమాలి, వ్యవసాయ కార్మికులకు అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, రైతుల మోటార్లకు మీటర్లు బిగించరాదని, ఈ నెల 26న జరుగు దేశవ్యాప్త ఆందోళనలో కార్మికులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని, విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

దూరవిద్య పరీక్షల్లో జోరుగా సాగుతున్న చూసి రాతలు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్యా పరీక్షల్లో జోరుగా చూచి రాతలు జరుగుతూ ఉన్న పర్యవేక్షణ అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలడంతో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్ నిర్వాహకులది ఆడింది ఆట, పాడిందే పాటగా పరీక్షల విధానం కొనసాగుతుందని, ఈ సెంటర్లను వెంటనే సీజ్ చేయాలని వారికి కొమ్ము కాస్తున్న పర్యవేక్షణ అధికారులను సస్పెన్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులులి డిమాండ్ చేశారు. గురువారం నాడు స్థానిక సిఆర్ భవన్ నందు జరిగిన పత్రిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అనుబంధ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్స్ నిర్వాహకులు పత్తికొండ వైష్ణవి, డోన్ వైష్ణవి, గూడూరు ఎస్సార్ సెంటర్లు అక్కడ అడ్మిషన్లు తీసుకొని పరీక్షలు మాత్రం యూనివర్సిటీ నిబంధనలకు వ్యతిరేకంగా వేరే ప్రాంతమైన కర్నూలు నగర శివారు ప్రాంతాల్లో అబ్దుల్లా బీఈడి కాలేజ్, ఎస్ఎల్వీ బీడీ కాలేజ్, బాలశివ డిగ్రీ కాలేజీల్లో పరీక్షలు నిర్వహిస్తున్న ఉన్న యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. నగర శివారులలో ముందుగా డిస్టెన్స్ సెంటర్ల యాజమాన్యాలు అభ్యర్థులతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఒక్కో అభ్యర్థి నుంచి చూసి రాత కొరకు రూ.3వేలు, రూ.4 వేలు, వసూలు చేసి ఒక అభ్యర్థి బదులు మరొక అభ్యర్థి పరీక్ష రాయడానికి పదివేల రూపాయల వరకు వసూలు చేసి గేట్లకు తాళాలు వేసి జోరుగా మాస్కాపింగ్ జరుగుతా ఉన్న పర్యవేక్షణ అధికారులు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని ఇలాంటి అధికారులను కూడా సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో అడ్మిషన్ తీసుకున్న అభ్యర్థులకి యాజమాన్యాలు మెటీరియల్ సప్లై చేయవలసి ఉండగా మెటీరియల్ ఇవ్వకుండా పరీక్షా సమయంలో మీరు పరీక్షలు పాస్ కావాలంటే చూసి రాయాలంటే తప్పని సరిగా డబ్బులు చెల్లించాల్సిందే అంటూ చెప్పడమే కాకుండా, డబ్బులు యూనివర్సిటీ అధికారులకు కూడా వాటా ఉందని బహిరంగంగా చెబుతా ఉన్నారన్నారు. ఇలాంటి యాజమాన్యాలపై చర్యలు తీసుకొని వెంటనే ఆ సెంటర్లను సీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు బాబయ్య ,బిసన్న, నగరనాయకులు చంటి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం ధర్నా..

విశాలాంధ్ర - కోడుమూరు : అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో మండలంలోని వర్కూరు గ్రామ సచివాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు.గురువారం సిపిఐ వర్కూరు గ్రామ శాఖ నాయకులు బాష అధ్యక్షతన నిరుపేదలైన అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ ధర్నాలో సిపిఐ మండల కార్యదర్శి బి.రాజు మాట్లాడుతూ గ్రామాలలో అనేకమంది ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామానికి దూరంగా స్థలాలు కేటాయిస్తే అక్కడికి ఎలా వెళ్తారని, ఒక సెంటు స్థలమిస్తే ఎలా వారు కాపురాలు నిర్వహిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఇళ్ల స్థలాల అర్జీలను గ్రామ శాఖ కార్యదర్శికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్కూరు శాఖ మహిళా సమాఖ్య నాయకురాలు లక్ష్మీదేవమ్మ, నాయకులు మునిస్వామి, గుర్రంబండి రంగడు, లక్ష్మన్న పాల్గొన్నారు.

24న కురువ కార్తిక వనభోజనాన్ని జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - కర్నూలు : జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో నగర శివారులోని పెద్దపాడు రోడ్డులోని శ్రీ బీర లింగేశ్వర స్వామి దేవాలయం నందు 22వ కార్తీక వనభోజనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక వనభోజన కార్యక్రమం 24న ఆదివారం జరుగుతుందని, కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి ఎస్.సవితమ్మ, హిందూపురం, కర్నూలు ఎంపీలు బీకే పార్థసారథి, బస్తిపాటి నాగరాజు తదితర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. విజయవంతం చేసేందుకు ఉమ్మడి జిల్లా కురువ కులస్తులందరూ పాల్గొని, జయప్రదం చేయాలని గుడిసె శివన్న కోరారు.

ప్రైవేట్ విద్యా సంస్థలకు అండగా ఉంటాం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : యునైటెడ్ ప్రైవేట్ స్కూల్స్ ఫెడరేషన్ నాలుగవ వార్షికోత్సవం వైజాగ్‌లో జరిగిన ప్రైవేటు పాఠశాలలన్నీ ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయులను ఎస్టీ లాండర్స్ హై స్కూల్ రాష్ట్ర అధ్యక్షులు వెలువల సుదర్శన్ గౌరవ అధ్యక్షులు సతీష్ కుమార్ నిర్వహించడం జరిగింది. నూతన కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎస్.క్రిస్టోఫర్, కర్నూలు, నంద్యాల కన్వీనర్ సి.కుమార్, జిల్లా అధ్యక్షులుగా ఎం.రాఘవేంద్ర రాజు, జిల్లా కార్యదర్శిగా బి.రఘునాథ్ రెడ్డి, జిల్లా ట్రెజరర్ కే. శ్రీనివాసులు, జిల్లా జాయింట్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు తోపాటు సిటీ అధ్యక్షులుగా టి.నాగన్న, సిటీ జాయింట్ సెక్రెటరీ ఎలిసా బాబు, ట్రెజరర్ నాగరాజు ఏకీగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కర్నూలు ప్రైవేటు విద్యా సంస్థల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు చేశారు.

రూ.13.86 లక్షల చెక్కును అందజేత

విశాలాంధ్ర- ఆదోని క్రైం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం చంద్రబాబుకు రూ.13.86లక్షల చెక్కును అందజేయడం జరిగిందని ఎమ్మెల్యే పార్థసారధి తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు, వ్యాపారస్థులు, ఉద్యోగస్తులు ఆదోని బీజేపీ నాయకులతో కలిసి గురువారం విజయవాడలో సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విపత్తులో ఉన్న ప్రజలకు సాయం చేయాలని ఇచ్చిన పిలుపు మేరకు ఆదోని ప్రజలు స్పందించి విరాళాలు అందజేసిన ప్రతి ఒక్కరికి ధన్యావాదాలు తెలిపారు. రాష్ట్రంలో ఏ ఆపద వచ్చిన ఆదోని ప్రజల నుంచి తోచిన సహాయం చేసేందుకు ఎల్లప్పుడు ముందుంటామని తెలిపారు. బీజేపీ నాయకులు దేశాయ్‌చంద్రన్న, విట్టారమేష్, నాగరాజుగౌడ్, చిన్న బసప్ప తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సరళిపై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర - నందవరం : భారతరాజ్యాంగ దినోత్సవంను పురస్కరించుకొని నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం శేఖరప్ప ఆధ్వర్యంలో విద్యార్థుల ద్వారా మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో భారతరాజ్యాంగం ప్రజలకు కల్పించిన వజ్రాయుధం ఓటు హక్కు అని, 5 సంవత్సరాలకు ఒకసారి ఎన్నికల సరళి ఏలా వుంటుదో మాక్ పోల్ ద్వారా విద్యార్థులకు తెలిపారు. ఓటర్ లిస్టు తయారీ, అభ్యర్థుల జాబితాతో కూడిన బ్యాలెట్ పేపర్, పోలింగ్ ఆఫీసర్లు, ఓటింగ్ కంపార్ట్ మెంట్, బ్యాలెట్ బాక్స్ ఏర్పాటు చేసి మాక్ పోల్ నిర్వహించారు. ఉపాధ్యాయులు ఉమాదేవి, మద్దయ్య, ఎస్.పరమేష్, రాజు, పార్వతిదేవి, ప్రసాద్, బసవరాజు, జె.ఎల్లప్ప, సూర్యనారాయణ, జయన్న, సత్యన్న మేరి పాల్గొన్నారు.

మారని రైతు సేవ కేంద్రాల బోర్డు

విశాలాంధ్ర - హొళగుంద: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పథకాల పేర్లను మారుస్తూ జీవోలు విడుదల చేసిన అధికారుల నిర్లక్ష్యంతో రైతు సేవ కేంద్రాల భవనాల బోర్డులు మాత్రం మారడం లేదని ప్రజలు గురువారం వాపోయారు. రాష్ట్ర పరిపాలనలో రైతులు రైతు సేవ కేంద్రం ద్వారా సౌకర్యాలు పొందుతున్నారు. రైతు సేవ కేంద్రాలలో వ్యవసాయ శాఖ ఉద్యోగస్తులు, సిబ్బంది విధి నిర్వహణలో ఉన్నారు. గతంలో నిర్మించిన భవనాలకు రైతు భరోసా కేంద్రంగా ఉన్న బోర్డును అధికారులు తొలగించకపోవడం విమర్శలకు దారితీస్తుంది. రైతు సేవ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో ని రైతులకు ఎన్నో విధాల సదుపాయాలను కల్పిస్తుంది. హొలగుందలో మాత్రం రైతు భరోసా కేంద్రాలకు సంబంధిత అధికారులు రైతు సేవ కేంద్రాలుగ మార్చకపోవడంతో రైతు భరోసా కేంద్రాలుగా భవనాలు ప్రజలకు రోజు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని రైతు సేవ కేంద్రాలుగా మార్చాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

టీబీ ఉచిత మొబైల్ ఎక్స్‌రే వాహన సేవలు

విశాలాంధ్ర - పెద్దకడబూరు: మండల పరిధిలోని చిన్నతుంబలం గ్రామంలో గురువారం టీబీ ఉచిత మొబైల్ ఎక్స్ రే వాహన సేవలను రోగులకు అందజేశారు. ఈ సందర్భంగా టీబీ సూపర్ వైజర్ స్వరూప్ రాజ్ కుమార్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం ఉమ్మిలో రక్తం రావడం వంటి లక్షణాలు ఉన్న వారికి ఉచిత ఎక్స్‌రే పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీరేష్ గౌడ్, శివ, వైద్య సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మరో అవకాశం కల్పించిన

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : 2018-20 విద్యా సంవత్సరంలో ప్రైవేట్ డిఎల్ ఈడి, కళాశాలలలో, స్పాట్ అడ్మిషన్, మేనేజిమెంటు కోటాలో అడ్మిషన్ పొందిన, విద్యార్థులకు రెండవ సంవత్సరము ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. కర్నూలు, నంద్యాల జిల్లాలోని ప్రైవేటు డీఎడ్ కళాశాలల ప్రిన్సిపాల్లకు 22న ఉదయం డిఐఈటి కళాశాల మీటింగ్ ఏర్పాటు చేయడమైది.

మరిన్ని వార్తలు E-PAPERలో..

రోడ్డుకు అడ్డంగా పెట్టిన రాళ్లు తొలగింపు



విశాలాంధ్ర - హొళగుంద: హొళగుంద నుండి మార్లమడికి వెళ్లే రోడ్డు మార్గంలో కొందరు రాళ్లు అడ్డంగా పెట్టడంతో గురువారం విశాలాంధ్ర పత్రికల్లో రోడ్డుంగా అడ్డంగా పెట్టిన రాళ్లు అనే శీర్షికకు స్పందించిన ఎస్సై బాల నరసింహులు సిబ్బంది గురు ప్రసాద్ ద్వారా రాళ్ళను ఎత్తివేశారు రోడ్డుకు రాళ్లు ఎవరైనా అడ్డంగా పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జంగాలి కాలనీ వద్ద రోడ్డుకు అడ్డంగా రాళ్లు పెట్టడం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ఈ ఓఆర్ డి చక్రవర్తి రోడ్డుకు అడ్డంగా పెట్టిన ప్రదేశాన్ని పరిశీలించారు. మార్లమడకి గ్రామ పెద్ద రమేష్ ఈఓఆర్డి, గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ్‌కు రాళ్లు తొలగించాలని ఫోన్ ద్వారా ఫిర్యాదించారు. స్పందించిన పోలీసులు రాళ్లను తొలగించడంతో ప్రజలు విశాలాంధ్ర పత్రికకు, పోలీస్ సిబ్బందికి, కృతజ్ఞతలు తెలిపారు.

వేగవంతంగా టీడీపీ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర- గూడూరు: గూడూరు పట్టణంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ నాయకులు వేగవంతం చేశారు. గురువారం పట్టణ తెలుగు యువత కార్యదర్శి కురుకుంద విజయ్ కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదును సభ్యులచే చేయించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ గూడూరు పట్టణంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేశామని చెప్పారు. లక్ష చెల్లించిన వారికి శాశ్వత సభ్యత్వ నమోదు వర్తిస్తుందని, వంద చెల్లించిన సభ్యులకు రూ.5 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని టిడిపి కల్పిస్తుందన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : లిఎమ్మిగనూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న నాటూరు నీల కంఠకి బ్రెయిన్‌లో రక్తనాళాల సమస్యతో బ్రెయిన్ ఆపరేషన్ కొరకు కర్నూలు లోని కామినేని ఆసుపత్రిలో చేరారు. ఆయన్ను పరామర్శించి ఉపాధ్యాయుల సహకారంతో సేకరించిన విరాళాలు రూ.3 లక్షల అందజేసిన ఎస్‌టియు నాయకులు అందజేశారు. ప్రసన్నరాజు, వెంకటేశ్వర్లు తోటి ఉపాధ్యాయునికి ఆరోగ్యం సరిగా లేక ఆసుపత్రిలో చేరిన విషయం తెలుసుకొన్న ఉపాధ్యాయులు ఎస్టియు నాయకుల పిలుపు మేరకు స్వచ్ఛందంగా విరాళాలు అందజేసి ఉపాధ్యాయులు గొప్ప మనసు చాటుకున్నారని వారు తెలిపారు. ఎస్టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోకారి, జనార్ధన్‌లు, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, ఎస్‌టియు నాయకులు మహమ్మద్ షఫీ, బసవరాజు, బాబయ్య, యల్లప్ప, అడివన్న, సిద్ధ లింగమూర్తి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అన్నారు. రహదారుల భద్రత కమిటీ నిర్ణయాల అమలుకు సంబంధించి గురువారం బిర్లా కంపౌండ్, గాయత్రీ ఎస్టేట్, సి.క్యాంప్, నంద్యాల చెక్‌పోస్ట్, వై జంక్షన్, కొండారెడ్డి బురుజు తదితరుల ప్రాంతాల్లో కమిషనర్ రహదారుల భద్రత కమిటీతో పర్యటించారు. రహదారుల భద్రత కమిటీ నగరానికి సంబంధించి 21 నిర్మాణాలు తీసుకున్నదని, వాటి అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, ట్రాఫిక్ సిఐ మన్సూర్ బాష, ఆరోగ్యధికారి విశ్వేశ్వర్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంఈలు శేషసాయి, సత్యనారాయణ, డిఈఈ మనోహర్ రెడ్డి, సూపర్వైజర్ అంజద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

25న జడ్పీ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - జిల్లా పరిషత్, కర్నూలు: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 25వ తేదీన జరుపబడుతున్నట్లు సీఈవో జి.నాసర రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యుత్ నీటి పాదాల శాఖపై నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి కర్నూలు నంద్యాల జిల్లాలకు చెందిన ఇంచార్జి మంత్రులు నిమ్మల రామానాయుడు పయ్యావుల కేశవ్ మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్ రెడ్డి, ఎన్ఎండి ఫరూక్‌తో పాటు పార్లమెంటు సభ్యులు శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు హాజరవుతున్నరని అన్నారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు జడ్పిటిసిలు ఎంపీపీలు హాజరు కావాలని అన్నారు.

26న జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఓర్వకల్లు : 26న జరుగు ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. గురువారం ఓర్వకలు ప్రజా సంఘాల కార్యాలయంలో అఖిలపక్ష రైతు కార్మిక సంఘాల సమావేశం ఆంధ్ర ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి పి.సుధాకర్, ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షులు ఎస్.మధుసూదన్, సిఐటియు మండల నాయకులు వి.సుధాకర్ మాసుం బాష పాల్గొన్నారు. ఈనెల 26 వ తేదీ జరిగే ర్యాలీ ధర్నాను కార్మికులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

హైకోర్టు బెంచ్ రావడం అభినందనీయం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం కర్నూలుకి హైకోర్టు బెంచ్ ఏర్పాటుకి ఆమోదం తెలుపడం శుభదాయకం అని టిడిపి రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని ఆయన స్వగృహం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

రూ.34 కోట్లతో బసాపురం ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణం

విశాలాంధ్ర- ఆదోని : ఆదోని ప్రజల దాహార్తిని తీర్చే బసాపురం ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణం కోసం రూ. 34 కోట్లు అవసరమని మున్సిపల్ కమీషనర్ కృష్ణ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బసాపురం ఎస్ఎస్ ట్యాంక్ చుట్టూ సిమెంట్ బెడ్డు వేయడంతో బెడ్డు ఒరిగిపోవడం జరుగుతోందని, శాశ్వత పరిష్కారంగా స్టోన్ పిచ్చింగ్ రాళ్లతో నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎస్ఎస్ ట్యాంక్ చుట్టూ దాదాపు 3.75 కిలో మీటర్లు వుందని, నిర్మాణానికి రూ.34 కోట్లు అమృత్ స్కీమ్ లేదా జల్ జీవన్ మిషన్, ప్రభుత్వ స్పెషల్ గ్రాంట్ కింద నిధులు మంజూరు చేస్తే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఎస్ఎస్ ట్యాంక్‌లో తాత్కాలిక పనులు చేపట్టినప్పటికి ప్రయోజనం లేకుండా పోతోందని, ట్యాంక్‌లో 100 శాతం నీటి నిల్వ చేయలేని పరిస్థితి వుందని, ట్యాంక్‌లో నీటి అలలతో సిమెంట్ బెడ్డు కూలిపోతుండడంతోనే శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంక్‌లో 2200 మిలియన్ లీటర్ల నీటిని నిల్వ చేయవచ్చని, పట్టణంలో రోజు వారి 22.5 మిలియన్ లీటర్ల నీటిని అందిస్తున్నామని అన్నారు. ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరైతే పట్టణంలో నీటి ఎద్దడి తలెత్తకుండ ఎల్లెల్సీ కాలువ నుండి రాంజలకు పంపింగ్ చేస్తామని, రాంజలలో దాదాపు 1210 మిలియన్ లీటర్ల నీటిని దంపింగ్ చేయవచ్చన్నారు. 500హెచ్‌పీ మూడు మోటార్లు వుండగా ప్రస్తుతం ఒక మోటార్‌తోనే నీటిని పంపింగ్ చేస్తున్నామని తెలిపారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరై పనులను ప్రారంభిస్తే 6 నుండి 15 నెలల సమయం పట్టవచ్చని అంచనా వేశారు. పట్టణంలో ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో ప్రతి రోజు మంచినీరు సరఫరా చేస్తున్నామని, మిగితా వార్డుల్లో రెండు రోజులకోసారి మంచినీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని, నీటి సమస్య తలెత్తకుండ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతోందని తెలిపారు.

బలిజ సంఘం కార్తీక వనభోజనాల కరపత్రం విడుదల



విశాలాంధ్ర - కర్నూలు సిటీ : ఈనెల 24న ఆదివారం నిర్వహిస్తున్న కార్తిక వనభోజనాలకు సంబంధించిన కరపత్రాన్ని జిల్లా కేంద్రంలోని కర్నూలు నగర కాపు, తెలగా, బలిజ సేవా సంఘం కార్యాలయంలో నాయకులు గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష కార్యదర్శులు గాండ్ల లక్ష్మన్న, రవికుమార్‌లు మాట్లాడుతూ గత 22 ఏళ్లుగా కార్తీక వనభోజనాలు సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్తీక వనభోజనాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. నంద్యాల రోడ్డులోని విజ్ఞాన పీఠం నందు సంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తున్న వనభోజనాల కార్యక్రమంలో నగరంలో ఉన్న బలిజ సంఘీయులే కాకుండా, చుట్టుపక్కల గ్రామాలు పట్టణాలలో బలిజ సంఘీయులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. బలిజ కులస్తులు రావడానికి వీలుగా బస్సు సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వచ్చిన వారికి ఆహ్లాదకరంగా ఉండే విధంగా, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా జబర్దస్త్ టీం వారితో హాస్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు. క్రీడా పోటీలలో పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం, అభినందన కార్యక్రమం కూడా ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో బలిజ సంగం నాయకులు శైలేష్, గోపీనాథ్, వెంకటేశ్వర్లు, అనిమీ రెడ్డి, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

మహిళల మరుగుదొడ్డికి తలుపుల్లేవ్..

విశాలాంధ్ర-హొళగుంద: మండల వెలుగు కార్యాలయంలో సిబ్బంది కోసం నిర్మించిన మరుగు దొడ్డికి తలుపు ధ్వంసమైంది. ధ్వంసమైన మరుగుదొడ్డి తలుపును కార్యాలయ గోడకు తాత్కాలికంగా నిలబెట్టడంతో రోజు కార్యాలయానికి మహిళలు, మహిళలు చిన్నారులతో అధిక సంఖ్యలో వస్తుంటారు. ప్రమాదవశాత్తు భారమైన ఇనుప తలుపు మీద పడి ఏమైనా జరిగితే ఎలా అని మహిళలు వాపోయారు. వాకిలి లేక పోవడంతో మరుగు దొడ్డిలో విష పురుగులు చేరే అవకాశం ఉందని ప్రజలు ఆరోపించారు. తలుపులు లేని మరుగుదొడ్డిని కార్యాలయ సిబ్బంది రోజు ఉపయోగిస్తున్నారు. మరుగుదొడ్డికి వాకిలి లేకపోవడంతో కార్యాలయం కంపు కొడుతుందని ప్రజలు వాపోతున్నారు. మరరుగు దొడ్డికి వాకిలి లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నట్లు ప్రజలు ఆవేదన చెందుతున్నారు. సంబం ధిత అధికారులు మరుగుదొడ్డి వాకిలి ఏర్పాటు చేయాలని పొదుపు సంఘం మహిళలు డిమాండ్ చేశారు. వెలుగు ఏపీఎం హనుమంతు మాట్లాడుతూ తలుపు ధ్వంసమైందని, ప్రత్యామ్నాయ తలుపు ఉపయోగిస్తామన్నారు.

సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలి



విశాలాంధ్ర- పత్తికొండ: రెవెన్యూ డివిజన్ కేంద్రం అయిన పత్తికొండలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రంగస్వామిలు కోరారు. గురువారం ఏపీ రాజధాని అమరావతిలో న్యాయశాఖ కార్యదర్శి వి.సునీతని ఎమ్మెల్యే కెఈ శ్యాంబాబుతో పాటు పత్తికొండ న్యాయవాదులు కలసి పత్తికొండలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు సహకరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో వెనుకబడిన పత్తికొండ పట్టణంలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు లేకపోవడంతో న్యాయవాదులు, కక్షిదారులు, ప్రజలు దాదాపు 40 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఆదోనికి వెళ్ళవలసి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం పత్తికొండ రెవెన్యూ డివిజన్ అవడంతో సీనియర్ సివిల్ జడ్జికోర్టు ఏర్పాటుకు అవకాశం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేష్, టీడీపీ రాష్ట్ర నాయకులు తుగ్గలి నాగేంద్ర, తిమ్మయ్య చౌదరి, న్యాయవాదులు బాల బాష, సుధాకృష్ణ, రాజశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర దొంగలముఠా అరెస్టు



విశాలాంధ్ర బ్యూరో - కరూక్నలు : జిల్లాలోని 21 కేసులలో దొంగలించిబడిన సొత్తును ఆదోని ఒకటవ పట్టణ పోలీసులు రికవరీ చేసి 13 మందిని అరెస్టు చేశారని జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ పాత్రికేయులకు వివరాలు వెల్లడించారు. 41 లక్షల ప్రాపర్టీ రికవరీ చేయడంలో ఆదోని సబ్ డివిజన్ పోలీసులు బాగా పని చేశారన్నారు. ఆదోని డిఎస్పీ సోమన్న, ఆదోని ఒకటవ పట్టణ సిఐ శ్రీరామ్, ఎస్సై రామ స్వామి, పోలీసుసిబ్బంది బృందాలుగా ఏర్పడి బాగా పని చేశార న్నారన్నారు. స్ఫూర్తిగా తీసుకొని కర్నూలు జిల్లాలోని మిగతా సబ్ డివిజన్ ల పోలీసులందరూ ప్రాపర్టీ రికవరీలు, మిస్సింగ్ కేసులు, పెండింగ్ కేసులలో మంచి ప్రతిభను చూపాలన్నారు. ఆదోని ఒకటవ పట్టణ పోలీసులకు జిల్లా ఎస్పీ రివార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదోని డిఎస్పీ సోమన్న, ఆదోని ఒకటవ పట్టణ సిఐ శ్రీరామ్, సిఐలు ప్రసాద్, కేశవరెడ్డి, అబ్దుల్ గౌస్, మన్సురుద్దీన్, శివశంకర్, ఆదోని ఒకటవ పట్టణ ఎస్సై రామస్వామి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



విశాలాంధ్ర - కర్నూలు : చట్ట సభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. కర్నూలులోని కృష్ణకాంత్ ప్లాజాలో జాతీయ బిసి సంక్షేమ సంఘం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. జాతీయ బిసి సంక్షేమ సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు వై. నాగేశ్వర యాదవ్ మాట్లాడుతూ బిసిల ఐక్యత కోసం అన్ని బీసీ కులాల తో కలసి సామూహిక వనభోజన కార్యక్రమాన్ని ఈ నెల 23న నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. బీసీల కులగణనతోపాటు, బీసీలకు చట్టసభల్లో రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆయన అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏపీ ప్రధాన కార్యదర్శి టి.మద్దులేటి మాట్లాడుతూ దేశంలో 50శాతం బీసీలున్నా ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేదన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, ఏపీ ఇన్చార్జి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు నూకారమ్మ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, పలువురు బిసి మంత్రులు,ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని చెప్పారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార చైర్మన్ లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్, జిల్లా గొర్రెల పెంపకం దార్ల యూనియన్ అధ్యక్షుడు శ్రీనివా సులు, వాల్మీకి నాయకులు కుబేరస్వామి తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర- పత్తికొండ: రెవెన్యూ డివిజన్ కేంద్రం అయిన పత్తికొండలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రంగస్వామిలు కోరారు. గురువారం ఏపీ రాజధాని అమరావతిలో న్యాయశాఖ కార్యదర్శి వి.సునీతని ఎమ్మెల్యే కెఈ శ్యాంబాబుతో పాటు పత్తికొండ న్యాయవాదులు కలసి పత్తికొండలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు సహకరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో వెనుకబడిన పత్తికొండ పట్టణంలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు లేకపోవడంతో న్యాయవాదులు, కక్షిదారులు, ప్రజలు దాదాపు 40 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఆదోనికి వెళ్ళవలసి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం పత్తికొండ రెవెన్యూ డివిజన్ అవడంతో సీనియర్ సివిల్ జడ్జికోర్టు ఏర్పాటుకు అవకాశం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేష్, టీడీపీ రాష్ట్ర నాయకులు తుగ్గలి నాగేంద్ర, తిమ్మయ్య చౌదరి, న్యాయవాదులు బాల బాష, సుధాకృష్ణ, రాజశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శుక్రవారం 22, నవంబర్ 2024

26న రైతు కార్మిక సంఘాల మహా ప్రదర్శన ధర్నా

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఈ నెల 28న కేంద్ర కార్మిక సంఘాలు కిసాన్ సంయుక్త మోర్చా జాతీయ సమితి పిలుపు మేరకు జిల్లా పరిషత్ నుండి కలెక్టరేట్ వరకు మహా ప్రదర్శన ధర్నాలను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప కోరారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం జిల్లా ఉపాధ్యక్షులు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి జి చంద్రశేఖర్, నగర ఉప ప్రధాన కార్యదర్శి టి రామాంజనేయులు, నాయకులు, ఎ.ఈశ్వర్, డిసి రహిమాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రైతు ఉద్యమ సందర్భంగా రైతులకు క్షమాపణ చెప్పి నల్ల చట్టాలను వెనక్కి తీసుకుంటామని రైతుల పండించిన పంటకు గిట్టుబాటు ధర చట్టం తీసుకొస్తామని ఉద్యమంలో చనిపోయిన రైతులకు ఎక్స్ గ్రేషియా చెల్లిస్తామని చెప్పి మాట తప్పాడని వారు విమర్శించారు. అనేక త్యాగాలు చేసి దేశ కార్మిక వర్గం సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకుని వచ్చి కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత,సమ్మె హక్కు,ఎనిమిది గంటల పని విధానం లాంటి హక్కులను హరించివేసి కార్మికులను యజమానులకు బానిసలు చేసేటువంటి చర్యలకు పూనుకుందని విమర్శించారు. ఆటో, హమాలి, వ్యవసాయ కార్మికలకు అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, రైతుల మోటార్లకు మీటర్లు బిగించరాదని, ఈ నెల 26న జరుగు దేశవ్యాప్త ఆందోళనలో కార్మికులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని, విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య అన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్యామల, మత్స్యకార సొసైటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా ఈ కార్యక్రమం ద్వారా మత్స్యకారులకు కెనరా బ్యాంకు వారి సహకారంతో కిసాన్ క్రెడిట్ లోన్ల రూపంలో 48 మంది మత్స్యకార కో-ఆపరేటివ్ సభ్యులకు రూ.12.85 లక్షలు అందజేయడం జరిగిందన్నారు. ఈ రుణాల ద్వారా మత్స్యకారులు ఎవ్వరీ మీద ఆధారపడకుండా వారి జీవనఉపాధికి ఉపయోగపడుతుందన్నారు. మిగితా బ్యాంకులు కూడా మత్స్యకార సంఘాలకు రుణాలు అందజేసేందుకు ముందుకు రావాలని కోరారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం మంచి మార్కెటింగ్ సేవలు కూడా అందజేయడం ద్వారా మంచి లాభాలు ఆర్జించే అవకాశం ఉంటుందన్నారు. మహిళలు కూడా కో-ఆపరేటివ్ సంఘాలుగా ఏర్పడి తక్కువ సమయంలో ఎక్కువ లాభాలను వచ్చే అవకాశం ఉంటుందని అందుకు జిల్లా కలెక్టర్ కూడా బ్యాంకర్లతో సమావేశాలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. కర్నూలు నగరానికి హైదరబాద్, బెంగళూరు నగరాలు చాలా దగ్గరగా ఉన్నాయని, హైదరబాద్ నగరంలో ఎటువంటి నీటి వనరులు లేవు కాబట్టి మన జిల్లాలో ఉన్న మత్స్యకారులు ఎగుమతి మీద దృష్టి పెట్టి మరింత అభివృద్ధి పొందే అవకాశం ఉంటుందని అందుకు మత్స్య సంఘాల కూడా కృషి చేయాలన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మత్స్యకారులకు అభినందనలు తెలిపారు. అనంతరం 48 మంది మత్స్యకార కో-ఆపరేటివ్ సభ్యులకు కెనరా బ్యాంకు ద్వారా కిసాన్ క్రెడిట్ లోన్ల ద్వారా రూ.12.85 లక్షల మెగా చెక్కును జాయింట్ కలెక్టర్ మత్స్యకార కో-ఆపరేటివ్ సభ్యులకు అందజేశారు. అనంతరం మత్స్యకార సొసైటీ సభ్యులు, రైతులు జాయింట్ కలెక్టర్ ను శాలువ, పుష్పగుచ్చం అందజేశారు. జిల్లాలో ఉత్తమ మహిళా కో-ఆపరేటివ్ సభ్యులుగా రాణిస్తున్న బెస్త సునీతమ్మ, ఉత్తమ మార్కెటింగ్ చేస్తున్న కౌసల్యను జాయింట్ కలెక్టర్, మత్స్య శాఖ అధికారి చేతుల మీదుగా మోమెంటో, శాలువతో సత్కరించారు. అనంతరం ఉత్తమ మత్స్యకార సొసైటీ సభ్యులను, ఆక్వా రైతులను శాలువతో జిల్లా మత్స్య శాఖ అధికారి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి శ్యామల, కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ సుశాంత్ కుమార్, డిసిఓ రామాంజనేయులు, సహాయ సంచాలకులు సంధ్యారాణి, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ శేఖర్, మత్స్య సొసైటీ సభ్యులు, మహిళ మార్కెటింగ్ మత్స్యకార సభ్యులు, ఆక్వా రైతులు, రైతులు, ఎఫ్పిఓలు, మత్స్యకార సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాకృతి ప్రారంభించిన మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్

విశాలాంధ్ర - కర్నూలు: ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత విశ్వశనీయమై మలబార్‌గోల్డ్ అండ్ డైమాండ్స్ స్వర్ణాకృతి ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్టోర్ హెడ్ ఫయాజ్, అసిస్టెంట్ స్టోర్ హెడ్ మైజ్, సేల్స్ మేనేజర్ అజీష్, సుధాకర్, మన్సూర్ పాల్గొన్నారు. భారతదేశం గొప్ప వారసత్వాన్ని సమకాలిన డిజైన్‌లతో అందంగా సమ్మేళితం చేసి తయారు చేసిన బంగారు ఆభరణాలు ఈ క్లాసిక్ క్యూరేటర్ ప్రదర్శిస్తుంది. అత్యంత హస్తకళా నైపుణ్యం కలిగిన స్వర్ణకారు లచే కళాత్మకత, నైపుణ్యం కలబోసి రూపొందిం చబడిన అద్భుతమైన సేకరణను ప్రింట్, టెలివిజన్‌లో ప్రదర్శిస్తూ ప్రచారం శ్రీకారం చుడుతుంది.

హజరత్ హాసన్ వలి మౌలాలి స్వామి ఉత్సవాలు

విశాలాంధ్ర-డోన్ : డోన్ పట్టణంలో కొండపేటలో శ్రీ హజరత్ హసన్ వలి మౌలాలి స్వాముల ఉరుసు మహోత్సవములు ఈ నెల 22వ తేదీ నుండి 24 తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ కార్యదర్శి ఎస్‌పి చిన్న రహిమాన్ తెలిపారు. ఉరుసు మహోత్సవాలకు భక్తులు, దాతలు సహకారాలను అందించాలని గురువారం కోరారు. 22వ తేదీన శుక్రవారం సాయంత్రం 6 గంటలకు స్వర్గ్యులైన దర్గా పీఠాధిపతి అధ్యక్షులు కాజ మాసం వలి హుస్సేన్ చిస్తి ఖలీఫా స్వామి ధర్మపత్ని షేక్ రహీంబి ఇంటి నుండి గంధం తీసుకొని వస్తారని వివరించారు 23వ తేదీ శనివారం ఉరుసు రోజు అన్నదానము జరుపబడునని అన్నారు. 24వ తేదీ ఆదివారం నాడు కిస్తీ జియారతులు జరుపబడునని, ఈ నెల 24వ తేదీ ఆదివారం ఏ ఈ గోపి గౌడ, దర్గా కమిటీ కార్యదర్శి షేక్ అహ్మద్ బాష, తులసి నాయక్, పద్మనాయక్, ముంతాజ్ నాయక్, వారి ఇంటి నుండి కిస్తీ ప్రసాదములు తీసుకొని వస్తారని తెలిపారు. మూడు రోజుల పాటు ఉత్సవాలను గౌరవ అధ్యక్షులు శ్రీఅయ్యకొండ అక్బర్ హుసేని సాహెబ్ శ్రీఅక్బర్ బాషా సాహెబ్ చిస్తి కలీఫా, శ్రీ సూఫీ పండిత్ సయ్యద్ ఖాజా బాష సాహెబ్ ముబాలిగ్ ఈ ఇస్లాం ఖాదిరి, శ్రీ సూఫీ సయ్యద్ జాకీర్ హుస్సేన్ సాహెబ్ ముబాలిగ్ ఈ ఇస్లాం ఖాద్రి చిస్తిగారు, సూఫీ సయ్యద్ ఇస్మాయిల్ జబి ఉల్ల ఈ ఇస్లాం ఖాద్రి చిస్తి, షేక్ అన్వర్ బాష, వోక్స బోర్డుమాజీ డైరెక్టర్, సలింద్ర, నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తారని, ఉరుసుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

సంక్షేమ పథకాల కోసం ఎన్పీసీఐ చేసుకోండి

విశాలాంధ్ర - హెరాళగుంద: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాల కోసం ప్రజలు ఎన్‌సిపిఐ చేసుకోవాలని కోగిల తోట పోస్టుమాస్టర్ జగదీష్ విజ్ఞప్తి చేశారు. మూడో సచివాలయంలో గురువారం ప్రజలకు ఎన్‌సిపిఐ చేయించారు కేవలం 200 రూపాయలకే పోస్ట్ ఆఫీస్‌లో ఖాతాలు ప్రారంభిస్తామని, వీటి ద్వారా ప్రజలు ఆర్థిక లావాదేవీలు జరపవచ్చని అన్నారు. ఏటీఎం కూడా వస్తుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు పోస్ట్ ఆఫీస్ బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని ఉపాధి కూలీలు ఖాతా ద్వారా వేతనాలు పొందవచ్చని అన్నారు. ఎన్‌సిపిఐ చేసుకుంటే బ్యాంకు లావాదేవికి ఎలాంటి ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు.

బూత్ కమిటీలు త్వరగా పూర్తి చేయాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: బూత్ కమిటీలు త్వరగా పూర్తి చేయాలని నంద్యాల జిల్లా ఓబిసి అధ్యక్షుడు శివ కృష్ణ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ బివి సుబ్బారెడ్డి తెలిపారు. బిజెపి కార్యాలయంలో బిజెపి మండల అధ్యక్షులు యాదగిరి ఆధ్వర్యం లో బిజెపి మండల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశం లో ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శివ క్రిష్ణ యాదవ్, బనగానపల్లె అసెంబ్లీ కన్వీనర్ బీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. వారు ఈ సందర్భంగా కార్యకర్తలకు బూత్ కమిటీలు శక్తీ కేంద్ర ప్రముఖుల ఏర్పాటుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు శివరామి రెడ్డి, బాల వేంకటేశ్వర్లు, మండల నాయకులు నాగ మల్లారెడ్డి, పెద్ద శంకరయ్య, క్రిష్ణ, గోపాల్, శివ రామ్ రెడ్డి, శివయ్య, రామ కృష్ణ, తిరుమలయ్య, చంద్ర మోహన్ రెడ్డి, కర్ర సుబ్బరెడ్డి, తిమ్మాపురం శివ రామ్ రెడ్డి, బెస్త రామలింగం, వెంకటేష్, రజాక్, మియ్యా తదితరులు పాల్గొన్నారు.

పనివేళల మార్పు విరమించుకోవాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: పాఠశాలల పనివేళ మార్పు విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలిగించే విధంగా ఉంటుందని, ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం. మధుసూదన్ రావు, జిల్లా అధ్యక్షులు బి. మాధవస్వామి ప్రభుత్వాన్ని కోరారు. ఉన్నత పాఠశాలలు గ్రామాలలో ఉండడం, పాఠశాలకు చుట్టుపక్కల గ్రామాల నుండి విద్యార్థులు కాలినడకన, ఆటోలు సైకిల్ బస్సు ప్రయాణం చేయాల్సి ఉండడం అందులో విద్యార్థినులు సాయంత్రం చీకటి పడిన తర్వాత గ్రామాలకు వెళ్లడం కష్టతరమన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ వి.సుబ్బరాయుడు, కొలిమిగుండ్ల మండలం ప్రధాన కార్యదర్శి కె.రమేష్, పాల్గొన్నారు.

యురేనియం టెండర్లను తక్షణమే రద్దు చేయాలి

విశాలాంధ్ర - ప్యాపిలి: ప్యాపిలి మండలంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన యురేనియం టెండర్లను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పాత బస్టాండ్ ఆవరణం లో సిపిఐ ప్యాపిలి మండల కార్యదర్శి వి.వెంకటేష్ అధ్యక్షతన ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోన్ నియోజకవర్గం ప్యాపిలి మండల పరిధి లోని జక్కసానికుంట్ల, మామిళ్లపల్లె, రాంపురం, గ్రామాల్లో యురేనియం తవ్వకాలు వల్ల బంగారు పంటలు నాశనమై గాలి, నీరు కలుషితం అవుతుందని, దాదాపుగా యూరిన్ తవ్వకాల వల్ల 100 కిలోమీటర్ల ప్రమాదం ఉందన్నారు. పంట నష్టము, ప్రాణ నష్టము గ్రామ ప్రజలు అల్లాడిపోతున్న తరుణంలో ప్రశాంతంగా జీవిస్తున్న ప్రజలకు హానిక రంగా కలిగించే యూరియన్ త్రవ్వకాల వల్ల ప్రజలంత భయభ్రాంతులకు గురవుతు న్నారన్నారు. ఇలాంటి తరుణంలో కేంద్ర ప్రభుత్వం రూ.5 వేల కోట్లు టెండర్లకు ముహూర్తం ఖరారు చేసిందని ఇలాంటి టెండర్లను రద్దు చేయకుంటే సీపీఐ ప్రజా ఉద్య మాలకు పూనుకుంటామని వారు హెచ్చరించారు. మండలం కేవలం వర్షాధార మీద రైతులు పంటలు పండించు కొని జీవనం చేస్తున్నారని ఇలాంటి పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వం యూరియన్ త్రవ్వకాలకు అనుమతులు ఇవ్వడం ఇవ్వడం సిగ్గుచేటని తక్షణమే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అనుమతులు రద్దు చేయాలని ఆయన అన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం టెండర్ నోటీస్ ఇవ్వడం ప్రజల ప్రాణాలతో చెలగాటమా డడమే అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దుర్మార్గ మైన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రజలను కలుపుకొని ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు జిల్లా మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి ఎన్ఎండీ ఫరూక్ స్థానిక ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని వారు విజ్ఞప్తి చేశారు. లేకపోతే ప్రజాప్రతినిధుల ఇల్లు ముట్టడిస్తామని వారు అన్నారు. ఈ యురేనియం తవ్వకాల వల్ల పంట పొలాలు జీవ రాశుల మునుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రజలు చైతన్యం కావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ కార్య క్రమంలో సీపీఐ డోన్ మండల కార్యదర్శి బి.నారాయణ పట్టణ కార్యదర్శి మోట రాముడు, సీపీఐ ప్యాపిలి మండలం సహాయ కార్యదర్శి వెంకటేష్, డోన్ పట్టణ సహాయ కార్యదర్శి రామ్మోహన్, ఏఐ ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ ఏఐటీ యూసీ కార్యదర్శి అబ్బాస్, హమాలీ, ఆటో యూనియన్ నాయకులు శీను, మధు, మద్ది లేటి కార్మికులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

యురేనియం త్రవ్వకాల టెండర్లను రద్దు చేయాలి

జిల్లాలో డోన్ నియోజకవర్గం ప్యాపలి మండలంలో జక్కసాని కుంట్ల, మామిళ్ళపల్లి, రాంపురం గ్రామాల్లో యురేనియం త్రవ్వకాల కోసం వేసే టెండర్లను తక్షణమే రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అత్యంత వెనుక బడిన కరువు జిల్లాల్లో అత్యల్ప వర్ష పాతం వల్లరైతులకు పంటలు పండకుండా ప్రతి ఏటా సుదూర ప్రాంతాలకు పేద రైతులు, వ్యవసాయకూలీలు వలసలు పొట్ట చేత బట్టుకొని వెళుతున్న ఈ ప్రాంతాల్లో రైతుల పొలాలకు సాగునీరు అందించి రైతులను, వ్యవసాయకూలీలను ఆదుకోవడానికి శాశ్వత కరువునుపారద్రోలడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయకపోగా, కరువు ప్రాంతాల్లో యూరేనియం త్రవ్వకాలు చేపట్టి ప్రజల, జంతువుల జీవనాన్ని దెబ్బతీసి, వాతావరణాన్నే కలుషితం చేసే చర్యలు చేపట్టడానికి పూనుకోవడం చాలా దారుణం. ఈ త్రవ్వకాలవల్ల కడప జిల్లా పులివెందుల ప్రాంతంలో తుమ్మల పల్లి చుట్టుపక్కల ప్రజలు నరకప్రాయమైన జీవితాలను గడుపుతున్నారు. కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల చుట్టుప్రక్కల ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్రవ్వకాలను నిలిపి వేశారు.డోన్ శాసన సభ్యులు, జిల్లా మంత్రులు రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లి అత్యంత ప్రమాద కరమైన యురేనియం త్రవ్వకాల టెండర్లను రద్దు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని కె.రామాంజనేయులు డిమాండ్ చేశారు.

పత్తికొండలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర- పత్తికొండ: రెవెన్యూ డివిజన్ కేంద్రం అయిన పత్తికొండలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రంగ స్వామిలు కోరారు. గురువారం ఏపీ రాజధాని అమరావతిలో న్యాయశాఖ కార్యదర్శి వి.సునీతని ఎమ్మెల్యే కెఈ శ్యాంబాబుతో పాటు పత్తికొండ న్యాయవాదులు కలసి పత్తికొండలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు సహకరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో వెనుకబడిన పత్తికొండ పట్టణంలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు లేకపోవడంతో న్యాయవాదులు, కక్షిదారులు, ప్రజలు దాదాపు 40 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఆదోనికి వెళ్ళవలసి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం పత్తికొండ రెవెన్యూ డివిజన్ అవడంతో సీనియర్ సివిల్ జడ్జికోర్టు ఏర్పాటుకు అవకాశం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేష్, టీడీపీ రాష్ట్ర నాయకులు తుగ్గలి నాగేంద్ర, తిమ్మయ్య చౌదరి, న్యాయవాదులు బాల బాష, సుధాకృష్ణ, రాజశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

విజయవాడలో జరిగే మహాసభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో 2025 జనవరి నెల 11వ తేదీన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్థాయి వడ్డెర్ల మహాసభ జరుగుతుందని, ఈ మహాసభలో రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని వడ్డెర్లం దరూ తరలి రావాలన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వడ్డెర ప్రతినిధుల సమావేశంలో జాతీయ బీసీల కార్యదర్శి డాక్టర్ బత్తుల సంజీవ రాయుడు పిలుపునిచ్చారు. డాక్టర్ బత్తుల సంజీవరాయుడు మాట్లాడుతూ ఎన్నికల ముందు, ఆగస్టు 15న ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీ మేరకు వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. వడ్డెర ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.250 కోట్లు నిధులు మంజూరు చేయాలని, గనులలో క్వారీలలో 25 శాతం శాతం వడ్డెరలకు రిజర్వ్ చేయాలని రాష్ట్ర ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఈసారి రాబోయే అసెంబ్లీ సమావేశాలలో వడ్డెరలకి ఇచ్చిన హామీ మేరకు వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చే విషయము అసెంబ్లీలో తీర్మానం చేసి, పార్లమెంటు ఉభయ సభలైన లోక్ సభ, రాజ్యసభలకు పంపాలని కోరారు.

ఆత్మకూరులో రైతు సోదరుల సంబరాలు



విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్: పట్టణంలోని స్థానిక కౌలు రైతు సంక్షేమ సేవా సంఘం కార్యాలయంలో రైతు సంఘం అధ్యక్షులు టపాల్ అష్రఫ్ అలీ ఆధ్వర్యంలో రైతుల పంట పొలాలకు స్మార్ట్ విద్యుత్ మీటర్ లను రద్దు చేస్తూ ఎన్డీఏ ప్రభుత్వం జీవోను తీసుకొచ్చిన సందర్భంగా రైతులందరూ హర్షాన్ని వ్యక్తం చేస్తూ కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టపాల్ అష్రఫ్ అలీ మరియు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం భాష మాట్లాడుతూ రైతులకు మేలు చేయాలన్న, రైతులకు సంక్షేమ పథకాలు అందాలన్న, అది ఎన్డీఏ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని, మన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి రైతుల సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందు ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు టపాల్ అష్రఫ్ అలీ, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాష, టీడీపీ నాయకులు కౌన్సిలర్ గౌస్ లాజం, మైనార్టీ నాయకులు ముత్తు, టపాల్ లియాఖత్ అలీ, గౌస్, పెద్ద ముర్తుజా, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

క్లిష్టమైన ప్రసవాల నిర్వహణపై వైద్య సదస్సు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల ఐఎంఎ అనుబంధ విభాగం మిషన్ పింక్ హెల్త్ ఆధ్వర్యంలో స్థానిక మధుమణి ఆసుపత్రి సమావేశ భవనంలో నంద్యాల పాంత వైద్యులకు క్లిష్టమైన ప్రసవాలు- ఎదుర్కొనే సమస్యలు- అనుసరించాల్సిన నూతన వైద్య విధానాలు అన్న అంశంపై వైద్య సదస్సు నిర్వహించారు. ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు అధ్యక్షతన, మిషన్ పింక్ హెల్త్ రాష్ట్ర శాఖ కార్యదర్శి, లైఫ్ హాస్పిటల్ నిర్వాహకురాలు డాక్టర్ లక్ష్మీ సౌజన్య నిర్వహణలో జరిగిన సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని సదస్సు ప్రారంభించారు. వైద్య విధానం గురించి లైఫ్ హాస్పిటల్ లో స్త్రీ వ్యాధి నిపుణులుగా పని చేస్తున్న డాక్టర్ హేమలత, డాక్టర్ పుష్పలత, డాక్టర్ సుష్మ, డాక్టర్ గీతాంజలి, డాక్టర్ మధువాణి, డాక్టర్ స్రవంతి మల్టీమీడియా ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఐఎంఏ మహిళా విభాగం నాయకులు డాక్టర్ నాగమణి, డాక్టర్ నర్మద, డాక్టర్ వసుధ రాణి, డాక్టర్ కల్పన, డాక్టర్ అరుణకుమారి పాల్గొన్నారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటుతో హర్షం

విశాలాంధ్ర - నందవరం : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీ సమావేశంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు తీర్మానం చేసినందుకు నందవరం మండల మండల క్లస్టర్ ఇంచార్జ్, మాజీ సర్పంచ్ మాచాపురం ఖాసీం వలి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుతీరునప్పటినుంచి దశలవారీగా దీపావళికి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్, రాష్ట్రంలో రోడ్డులు పరిస్థితి అధ్వానంగా ఉన్న గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క రోడ్డు పట్టించుకోకున్న కూటమి ప్రభుత్వం రోడ్లకు శ్రీకారం చూట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రూ. 200 కోట్లు పైచిలుకు రోడ్డు మరమ్మతులకు బడ్జెట్ కేటాయించిందని, ఒక్కొక్కటి దశలవారీగా రైతులకు, విద్యార్థులకు, మహిళలకు, రోడ్ల గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అలాగే కర్నూలు జిల్లాలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అసెంబ్లీ సమావేశంలో తీర్మానం చేసినందుకు సియం చంద్రబాబు, ఎమ్మెల్యే డా. బివి జయ నాగేశ్వర రెడ్డికి మండలం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువ నాయకులు బడేసావలి, టిడిపి చిన్న రాముడు, ఈసా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - హెరాళగుంద: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు కూటమి ప్రభుత్వానికి రాయల సీమ ప్రజల తరఫున గురువారం టిడిపి నాయకుడు వన్నూరప్ప కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జిల్లాలో హైకోర్టు బెంచ్ లోకాయుక్త మానవ హక్కుల కమిషన్ ఏర్పాటు చేయడం ఇది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వమని మరోసారి రుజువు చేశారని అన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు పట్ల హర్ష వ్యక్తం చేశారు.

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : కర్నూలులో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.కృష్ణ మూర్తి, ప్రధాన కార్య దర్శి టీఎస్ రవికాంత్ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ పి.రవి గువేరా మాట్లాడుతూ న్యాయవాదులు 30 ఏళ్ల నుంచి పోరాటం వల్లనే కర్నూలుకు హైకోర్టు బెంచి ఏర్పాటు చేయడం జరిగిందని, అసెంబ్లీ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. న్యాయవాదులు కె.రంగ నాథ్, పి.దస్తగిరి, జాంగిర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.